## ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

దుండిగల్: లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సత్యనారాయణరావు, రెవెన్యూ అధికారులు సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించగా ప్రజలు పలు సమస్యలపై వినతులు అందజేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మున్సిపల్ ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ సత్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, జూనియర్ అసిస్టెంట్ గాయత్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ సర్కిల్ ఏఈగా లక్ష్మీగణేష్



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా లక్ష్మీగణేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కూకట్‌పల్లి జోనల్ పరిధిలో క్వాలిటీ సెల్ డీఈగా పనిచేసిన ఆయన ఇటీవల పదవి విరమణ చేసిన కృష్ణ చైతన్య స్థానంలో ఇక్కడికి వచ్చారు. సర్కిల్ పరిధిలో నెలకొని ఉన్న సమస్యలతో పాటు, మిగిలిన, టెండర్లు పూర్తయిన పనులను తొందరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం ఉపకమిషనర్ నరసింహన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

రంగారెడ్డినగర్: బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు పరుశ వేణు ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా సుధీర్‌కుమార్, దళిత మోర్చా అధ్యక్షుడిగా గణేష్‌లను నియమిస్తూ దివాకర్ నియామక పత్రాలను అందజేశారు.

## రసాయనాల ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా పేలుడు

**ఒకరికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు**

దుండిగల్: ఖాళీ రసాయనాల ట్యాంకర్‌కు వెల్డింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా పేలడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారానికి చెందిన ఫారూక్(35) మల్లంపేట నుంచి ఖాజిపల్లికి వెళ్లే దారిలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి ఖాళీ ట్యాంకర్‌కు వెల్డింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా ట్యాంకర్ పేలింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఫారూక్‌ను సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పేలుడు ఘటనలో సమీపంలో ఉన్న వాహనాల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పూడికతీత పనుల్లో నిర్లక్ష్యం!

- పలు ప్రాంతాల్లో డీసిల్టింగ్ పనులు పూర్తయినా కనిపిస్తున్న వ్యర్థాలు
- నాలాల్లో వ్యర్థాలు పూర్తిస్థాయిలో తొలగించాలని స్థానికులు డిమాండ్



గణేష్‌నగర్ బస్టాప్ సమీపంలోని నాలాలో తూతూమంత్రంగా డీసిల్టింగ్ పనులు



షాపూర్‌నగర్‌లో నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు



కాకతీయనగర్ కూరగాయల మార్కెట్ సమీపంలో నాలా బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

రంగారెడ్డినగర్: ప్రధాన నాలాల్లో పూడికతీత పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు మమ అనిపిస్తున్నారు. దీంతో ఈ వర్షాకాలంలో సైతం నాలాలు వరద నీటితో ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం పొంచి ఉంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో దాదాపు 32 కిలోమీటర్ల మేర నాలాలు విస్తరించి ఉన్నాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు రూ.83 లక్షలు, గాజులరామారం సర్కిల్‌కు రూ.75 లక్షలను నాలాల్లో పూడికను తొలగించేందుకు అధికారులు నిధులు కేటాయించారు. అయితే వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో డీసిల్టింగ్ పనులు పూర్తి చేసినా మరి కొన్ని చోట్ల నాలాల్లో వ్యర్థాలు అలాగే పేరుకుపోయాయి. దీంతో లక్షలాది నిధులు కేటాయించినా నాలా పూడికతీత పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ఎక్కడి సమస్య అక్కడే అన్న చందంగా మారుతోంది.

**వ్యర్థాలు తొలగించి.. మట్టిని వదిలేసి..**

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని 18 కిలోమీటర్ల మేర ఉన్న నాలా సుభాష్‌నగర్, అయోధ్యనగర్, చింతల్, కాకతీయనగర్, పాపయ్యయాదవ్‌నగర్‌ల వరకు, గాజులరామారం సర్కిల్ పరిధిలో 14కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నాలా గాజులరామారం, చిత్తారమ్మదేవినగర్, రోడామేస్త్రీనగర్, భగత్‌సింగ్ నగర్, శ్రీసాయినగర్‌ల మీదుగా గణేష్ నుంచి పారుతోంది. అయితే పలు చోట్ల నాలాలో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించినా మట్టిని తీయలేదు. ఇది నాలాలో వరదనీరు పారే సామర్థ్యంపై ప్రభావం చూపనుంది. దీంతో భారీ వర్షాలతో నాలాలు ఉప్పొంగి లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరే అవకాశముంది.

- చింతల్ కాకతీయనగర్‌లోని కల్వర్ట్ బ్రిడ్జి వద్ద పెద్ద మొత్తంలో వ్యర్థాలు పేరుకుపోయి కనిపిస్తున్నాయి. అదే విధంగా షాపూర్‌నగర్‌లోని సాగర్ హోటల్ ఎదురుగా ఉన్న నాలాలో వ్యర్థాలు తొలగించకపోవడంతో పాటు మట్టిని సైతం తీయకపోవడంతో నాలా కుచించుకపోయింది.

ఇక గణేష్‌నగర్ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించినా మట్టిని తొలగించలేదు. ప్రధాన రహదారుల గుండా వెళ్తున్న నాలా డీసిల్టింగ్ పనులు ఈ విధంగా ఉంటే ఇక బస్తీల గుండా వెళ్లే ప్రాంతాల్లో ఏ విధంగా పనులు చేపట్టారో అవగతమవుతోంది. ఇప్పటికైనా అధికారులు నాలా పూడికతీత పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి మిగిలిన ప్రాంతాల్లో సైతం డీసిల్టింగ్ పనులు చేసేలా కాంట్రాక్టర్లను ఆదేశించాలని పలువురు కోరుతున్నారు.

## ఉద్యోగులకు కనీస వేతన చట్టాన్ని వర్తింపజేయాలి



నిజాంపేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: ఉద్యోగులకు కనీస వేతన చట్టాన్ని వర్తింపజేయడంతో పాటు రెగ్యూలర్‌రైజ్ చేయాలని సోమవారం నిజాంపేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ రామకృష్ణరావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ... గత 20 సంవత్సరాలుగా నిజాంపేట్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయం నుంచి పని చేస్తున్నామని అన్నారు. నేడు నగర పాలక సంస్థగా రూపాంతరం చెందిన చాలీచాలని జీతాలతో వెల్లదీస్తున్నామని పేర్కొన్నారు. నెలకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ఇస్తున్నారని తెలిపారు. అది కూడా ప్రైవేట్ సంస్థల నుంచి తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పెరిగిన నిత్యావసరాలు, ఇళ్ల అద్దెలను దృష్టిలో ఉంచుకుని తమకు కనీసం రూ.25వేల వేతనాలను వర్తింపజేయాలని కోరారు. యూనియన్ నాయకులు సాయికృష్ణ, రమేష్, శివ, శేఖర్, మహేష్, రామకృష్ణ, రాము, సరిత, జానకిరావు తదితరులు ఉన్నారు.

## కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలి



బాలానగర్ పౌరసరఫరాల శాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: గత పదేళ్లుగా రేషన్ కార్డుల మంజూరు నిలిపివేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నేత చండీ శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. బాలానగర్‌లోని సివిల్ సప్లయ్ కార్యాలయంలో కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలని సోమవారం పౌరసరఫరాల శాఖ ఏఈకి వినతి పత్రం అందజేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో చాలా వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తవుతున్నా వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేదలకు ఏ సంక్షేమ పథకం వర్తించాలన్నా రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలని కోరారు. బీజేపీ రాష్ట్ర ప్రచార సహ కార్యదర్శి పత్తిరఘుపతి, ఓబీసీ మోర్చా నాయకుడు కృష్ణమూర్తి, జిల్లా నాయకుడు గణేష్ తదితరులు ఉన్నారు.

## తీగలకు అడ్డుగా ఉంటే తొలగిస్తారు..

**రాకపోకలకు అడ్డుగా ఉంటే తొలగించరా?**



భగత్‌సింగ్‌నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపం సమీపంలో రోడ్డుపై చెట్ల కొమ్మలు

చింతల్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న అధికారులు వాటిని తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ పరిధిలో ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు స్థానికంగా చెట్ల కొమ్మలను నరికివేయించారు. అయితే వాటిని తరలించకుండా రోడ్ల పక్కన కుప్పలు పోశారు. గత పదిరోజులుగా కొమ్మలు అలాగే ఉండటంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ సిబ్బందికి చెబితే సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తరలించేందుకు విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మురుగు పరుగు.. పట్టించుకోని అధికారులు



దుర్గా ఎస్టేట్స్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు

కుత్బుల్లాపూర్: సీవరేజీ లైన్లు, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో చెత్త పేరుకుపోవడంతో ఎక్కడికక్కడే మురుగు రోడ్లపై పారుతోంది. జీడిమెట్ల డివిజన్ దుర్గా ఎస్టేట్స్‌లో వారం రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు రోడ్డుపై చేరుతోంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో స్థానికంగా దుర్గంధ భరిత వాతావరణం నెలకొంటోంది. చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



# వచ్చామా.. కూర్చున్నామా.. పోయామా.!

**జంట సర్కిళ్ల కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటలకు ఇదీ పరిస్థితి**



ఇంటి పన్నులు చెల్లింపు కేంద్రంలో సిబ్బంది లేక ఎదురు చూస్తున్న గృహ యజమానులు



గాజులరామారం సర్కిల్ కార్యాయంలో డీసీ మల్లారెడ్డి, ముగ్గురు అధికారులు

## ఇదీ ప్రజావాణిలో అధికారుల తీరు



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొన్న డీసీ నరసింహ, ముగ్గురు అధికారులు

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అధికారులు మొక్కుబడిగా హాజరవుతూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒకవైపు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ ప్రతి విభాగం నుంచి అధికారులు ఉండాలని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తున్న జంట సర్కిల్ లో ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ప్రజావాణిలో వచ్చామా.! కూర్చున్నామా!! పోయామా..? అన్న విధంగా సాగింది. ఉదయం ప్రజావాణి ప్రారంభం సమయంలో కేవలం ముగ్గురు అధికారులతో ఉపకమిషనర్ నరసింహ ప్రారంభించిన కొన్ని విభాగం అధికారులు రాకపోయేసరికి ఫోన్లు చేసి పిలిపించుకునే పరిస్థితి ఏర్పడడం విశేషం. 11 గంటల తర్వాతనే కొందరు అధికారులు వచ్చి కూర్చోవడం గమనార్హం.

**స్పందించడం లేదనే విమర్శ...**

గాజులరామారం సర్కిల్ పరిధిలో ఉపకమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఇదే కార్యక్రమంలో ముగ్గురు అధికారులు మాత్రమే ఉండటం.. తర్వాత అందరూ వచ్చి హాజరు కావడం కనిపించింది. ఫిర్యాదులను పట్టించుకోకుండా కొంతమంది అధికారులు అది తమ పరిధి కాదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పలు సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే విమర్శ ఉంది. అధికారులు సమయపాలన పాటించకుండా జోనల్ కమిషనర్ ఆదేశాలను పట్టించుకోవడం లేదన్న విమర్శ ఉంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

**మొత్తం పది ఫిర్యాదులు...**

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంపై ఎనిమిది, టౌన్ ప్లానింగ్ విభాగంలో రెండు ఫిర్యాదులు రాగా, గాజులరామారం సర్కిల్ పరిధిలో ఒకటి ఇంజినీరింగ్ విభాగం పనులపై ఫిర్యాదు వచ్చింది. వీటిని వచ్చే సోమవారం లోపు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు చేయాల్సిన అధికారులు వినతి పత్రాలు తీసుకోవడమే తప్ప పనులు చేయడం లేదని పలువురు ఆరోపిస్తూ వెళ్లిపోవడం కనిపించింది.

- ఇంటి పన్నులు చెల్లించేందుకు సర్కిల్ పౌరసేవ కేంద్రానికి వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు వేచి చూశారు. క్యాషియర్ రాకపోవడంతో అందరూ ఉపకమిషనర్ నరసింహ దృష్టికి తీసుకువెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడే ఆపరేటర్ పనులు చేస్తున్న వ్యక్తిని కలెక్షన్ కోసం పంపించడం గమనార్హం. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రజలు తమ పన్నులను ఆన్‌లైన్, చెక్కుల రూపంలో మాత్రమే చెల్లించాలని, నగదు రూపంలో డబ్బులు తీసుకోవడం జరగదని నరసింహ పేర్కొన్నారు.

## చెరువులు, కుంటల సరిహద్దులకు ఫెన్సింగ్ వేయాలి

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్**

నిజాంపేట్: చెరువులు పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరామకుంట చెరువు ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మనిషి ప్రకృతితో మమేకమై జీవించినప్పుడే మనుగడ సాధ్యమన్నారు. భూగర్భ జలాల మట్టం పడిపోకుండా ఉండాలంటే చెరువులను కాపాడుకోవాలన్నారు. గతంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బండారి లేఔట్ అంటే ముంపునకు గురయ్యే ప్రాంతంగా ముద్రపడిందన్నారు. కాని గత పదేళ్ల కాలంలో ఎంతో ప్రణాళిక బద్ధంగా పనిచేస్తూ వరద ముంపును తొలగించడంతో నేడు ఇక్కడి ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

- ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తుర్క చెరువు, జంగారి కుంట, శ్రీరామ కుంట, ఎల్లంబాయి కుంటలకు సరిహద్దులను నిర్ణయించి చెరువు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో చెరువుల అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేసి పచ్చదనాన్ని పెంపొందిస్తామని తెలిపారు. అదే విధంగా వాకర్లకు అనువుగా ఉండేలా కాలిబాటలు, పర్యాటక ప్రాంతాలకు తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



నిజాంపేట్‌లోని శ్రీరామకుంట చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

## ఎల్లయ్య సేవలు ఎనలేనివి

సుభాష్‌నగర్: బాలయ్యనగర్ వ్యవస్థాపకులు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య వర్ధంతిని సోమవారం గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ అధ్యక్షుడు నాగేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేదలకు బట్టల పంపిణీ, అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు మాట్లాడుతూ... గతంలో గుడిసెలు ఉన్న బాలయ్యనగర్‌ను అన్ని రంగాల్లో ఎల్లయ్య ఎంతో అభివృద్ధి చేశారన్నారు. పేదలకు అండగా ఉన్న ఎల్లయ్య సేవలు ఎనలేనివని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్యనగర్ ప్రెసిడెంట్ నాగేష్, పార్వతి, గంగయ్య, ప్రసాద్, సునీల్‌కుమార్, గంగరామ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న బాలయ్య వాసులు